క్లుప్తంగా

హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్‌కు అభినందనలు



హెచ్‌ఎస్‌ఎల్ నూతన డైరెక్టర్ రాకేష్ ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నూతన డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్) కమోడోర్ రాకేష్ ప్రసాద్‌ను శనివారం షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు (ఐఎన్‌టీయూసీ) ప్రతినిధులు ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. యూనియన్ నాయకులను నూతన డైరెక్టర్ కమోడోర్ రాకేష్ ప్రసాద్ షిప్‌యార్డ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా క్రీడా వార్షికోత్సవం



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక ఇండస్ట్రియల్ ప్రాంతంలోని కేంద్రీయ విద్యాలయం–2లో శనివారం 39వ క్రీడా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌ఎస్ శాతవాహన కమెండర్ నామిని, సీనియర్ విద్యాశాఖాధికారి ఐఎన్‌ఎస్ శాతవాహన కమాండర్ సోనాల్ ద్రావిడ్ పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ద్రావిడ్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి ఉత్సాహం పెంచుతాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు పలు క్రీడా విన్యాసాలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బి.రామచంద్రరావు, బాలాజీ, లక్ష్మీపాపాయి, శివకుమార్, సుఫియా సుల్తాన్, వినోద్ కుమార్, జ్యోతిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మలుపు మాటున ముప్పు!



గొందేశివానిపాలెం నుంచి ములగాడ మార్గంలో ప్రమాదకర మలుపు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గొందేశివానిపాలెం నుంచి ములగాడ వెళ్లే మార్గంలో యు ఆకారంలో గల మలుపు ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. దీంతో ఆ మలుపు వద్ద సాఫీగా ముందుకు వెళితే చాలు దేవుడా అనుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి : గొందేశివానిపాలెం నుంచి ఐఎన్‌ఎస్ ఏకశిల రక్షణ గోడ పక్క నుంచి ములగాడ వెళ్లే మార్గం వద్ద యు ఆకారంలో మలుపు ఉంది. ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.దీనికి తోడు లైట్లు లేకపోవడంతో రాత్రివేళ వేగంగా వచ్చే వారు వాహనాలను నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో విద్యుత్ లైట్లతో పాటు మలుపు గుర్తించే విధంగా రేడియం స్టిక్కర్స్ వేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు దంపతులు

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీ రామాలయంలో శనివారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవాలు అర్చకులు నరసింహమూర్తి శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు దంపతులు, పైడి సత్యం దంపతులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతా మా ఇష్టం..!

ప్లాన్ ఒకలా... నిర్మాణం మరోలా

- కూటమి నేతల అండతో అడ్డగోలుగా నిర్మాణాలు
- జీవీఎంసీ ప్లానింగ్ విభాగంలో వసూల్ రాజాలు
- ప్రభుత్వ స్థలాలకు సైతం అనుమతులిచ్చేస్తున్న వైనం
- తేడా వస్తే బలైపోతున్న ప్లానింగ్ సెక్రటరీలు

– విశాఖ విద్య



సుసర్ల కాలనీలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీలో సింగిల్ యూనిట్ పేరిట అనుమతులు తీసుకొని ఏకంగా డబుల్ యూనిట్ నిర్మాణం చేపట్టారు. దీని ప్లాన్‌పై కూడా పలు అనుమానాలు ఉన్నాయి. భవనం ఎదురుగా జీవీఎంసీకి సంబంధించిన కాంపౌండ్ వాల్ ఉంది. ఇంత దర్జాగా నిర్మాణం చేపట్టగా టౌన్ ప్లానింగ్ అధికారులు చూస్తూ ఎందుకు మౌనం దాల్చారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.



ఎన్‌ఎస్‌టీఎల్ పక్కన నిర్మిస్తున్న భవనం

జీవీఎంసీ 90వ వార్డు పరిధి ఎన్‌ఎస్‌టీఎల్‌కు సమీపంలో రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తేరుకున్న జీవీఎంసీ జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డర్‌ను అప్రమత్తం చేశారు. రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌గా ఆ స్థలాన్ని మార్పు చేస్తూ అనుమతులు పొందాల్సి ఉంది. కానీ, ఈ లోగానే రెండు అంతస్తుల భవనం నిర్మాణం జరిగిపోయింది. ఇంతదాకా వచ్చినా. అధికారులకు ఇదేమీ కనిపించలేదా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ఇరువైపులా లాడ్జీలు ఉన్న చోట నిర్మిస్తున్న భవనం

జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న వ్యాపార సముదాయానికి తీసుకున్న అనుమతులకు మించి అదనంగా మరో ఫ్లోర్ వేశారు.చుట్టు పక్కల పూర్తిగా వ్యాపార సముదాయాలు ఉండడంతో ఇక్కడి నిర్మాణాలకు భారీ గానే గిరాకీ ఉంటుంది. హైవేపై వెళ్లే ప్రతీ ఒక్కరికీ కనిపించే ఈ భవన నిర్మాణం టౌన్ ప్లానింగ్ అధికారులకు కనిపించకపోవడంలో ఆంతర్యమేమిటనేది తేలాల్సి ఉంది.

బలిపశువులవుతున్న ప్లానింగ్ సెక్రటరీలు

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నాయా..? లేదా.. అనేది తరచూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంటుంది. కానీ, టౌన్ ప్లానింగ్ జోనల్ కార్యాలయ అధికారులు అనుమతులు ఇవ్వడం వరకే తమ పని అన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అనుమతులకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను ప్లానింగ్ సెక్రటరీలు అడ్డుకునే ప్రయత్నం చేసినా, సదరు యజమానులు జోనల్ స్థాయి ప్లానింగ్ అధికారులు, లేకుంటే కూటమి నేతలతో సిఫార్సు చేయిస్తుండడంతో వెనుక్కితగ్గాల్సి వస్తోందని పలువురు సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వాటిపై ఏదైనా ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో పనిచేసే ప్లానింగ్ సెక్రటరీలనే బలిపశువులు చేస్తూ టౌన్‌ప్లానింగ్ విభాగంలోని వసూల్ రాజాలు తప్పించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. జోన్–8 పరిధిలో ఇటీవల ఓ సెక్రటరీ సస్పెన్షన్‌కు గురికావడంలోనూ ఇలాంటి పరిణామాలే చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది.

కూటమి నేతల అండతోనే...

కూటమి నేతల అండదండలతో కొంత మంది అడ్డగోలుగా భవనాలు నిర్మిస్తున్నారు. అనుమతులు పొందిన ప్లాన్ ఒకలా ఉంటే... క్షేత్రస్థాయిలో నిర్మాణం మరోలా కడుతున్నారు. నిబంధనలకు పాతరేసి కళ్ల ముందే బహుళ అంతస్తుల నిర్మాణం జరిగిపోతున్నా జీవీఎంసీ ప్లానింగ్ విభాగం అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో తెరవెనుక భారీగానే వసూళ్ల పర్వం నడుస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇంటి నిర్మాణ అనుమతుల కోసం వెళితే సవాలక్ష నిబంధనలతో కొర్రీలు పెట్టే జీవీఎంసీ ప్లానింగ్ అధికారులు.. కూటమి నేతలు సిఫార్సులు చేస్తే మాత్రం ఫైల్ రయ్‌మని పరుగులు తీస్తోందని సామాన్య ప్రజానీకం అంటున్నారు. జీవీఎంసీ జోన్–5తో పాటు జోన్ –8 కార్యాలయ పరిధిలోని పలు వార్డుల్లో ప్రస్తుతం ఇదే తంతు సాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

జీవీఎంసీ ఆదాయానికి గండి

పశ్చిమ నియోజకవర్గంలో ఇటీవల కాలంలో భవన నిర్మాణాలు జోరందుకున్నాయి. అయితే సరైన అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేకుండానే నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని, అందువల్లనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు అంటున్నారు. జీవీఎంసీ 52వ వార్డు కరాసలో ప్రభుత్వ స్థలంలోనే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులు, ఆనక రెవెన్యూ అధికారుల విచారణతో ఆ అనుమతులు రద్దు చేయాల్సి వచ్చింది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేలా జీవీఎంసీ ఉన్నతాధికారులు ఇక్కడి టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు మీరితే అడ్డుకుంటున్నాం

ఎన్ఎస్‌టీఎల్ పక్కన రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్‌గా నిర్మిస్తున్నారు. మా దృష్టికి రాగానే చర్యలు తీసుకున్నాం. అది ప్రత్యేక జోన్‌లో ఉన్నందున తగిన అనుమతులు రావాల్సి ఉంది. అంత వరకు పనులు చేయనీయం. టౌన్ ప్లానింగ్ అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేస్తున్నాం. నేను ఇటీవలే ఇక్కడ బాధ్యతలు తీసుకున్నాను. పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నాం.

– రామలింగేశ్వరరెడ్డి, ఏసీపీ, జీవీఎంసీ జోన్–8

11 దేవాలయాల సముదాయం పునః ప్రారంభం



దేవాలయాల పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రెడ్డివీధి వద్ద పునర్నిర్మించిన సీతా లక్ష్మణ, హనుమాన్ సమేత రామాలయం, శివాలయం, సాయిబాబా, గాయత్రీదేవి, వేంకటేశ్వరస్వామి, సంతోషి మాత,గణపతి,సుబ్రహ్మణ్యస్వామి తదితర 11 దేవాలయాలను ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యువత దైవ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలవాలన్నారు. దేవాలయాల పవిత్రతను మనమంతా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాకి పాలిరెడ్డి,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటరమేష్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నరవ వెళ్లే ప్రధాన రహదారిలో యునైటెడ్ క్రైస్ట్ చర్చి సమీపంలో సీసీ రోడ్డు పనులకు శనివారం స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి పనులకు జీవీఎంసీ నిధులు రూ. 32.15లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, నాయకులు బొడ్డేటి విజయ్, బాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సందడి

- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు
- ముగ్గుల పోటీల్లో పాల్గొన్న తల్లులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ ఉన్నత,ప్రాథమిక పాఠశాలల్లో శనివారం సందడి వాతావరణం కనిపించింది. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలు (పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్) నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.

- మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని పలు సూచనలు సలహాలు అందించారు.
- 58వ వార్డు శ్రీహరిపురం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పచ్చటి మొక్కలతో పాటు, రంగు రంగుల కలర్స్, బెలూన్లతో అందంగా ముస్తాబు చేసి వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులతో కలిసి స్వాగతించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.బి.పద్మజ మాట్లాడుతూ పిల్లల నడవడిక పై తల్లిదండ్రులు దృష్టిసారించాలని కోరారు.



ములగాడలోవిద్యార్థికి పుస్తకం అందిస్తున్న కార్పొరేటర్ లావణ్య

- ములగాడ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ముఖ్య అతిథిగా పాల్గొని పలు క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.
- 61వ వార్డు మల్కాపురం ప్రాథమిక పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని విద్యార్థులకు కానుకలు అందించారు
- ఇండస్ట్రియల్‌కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో బౌద్ధ బిక్షువు రామ్ పాల్గొని విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.



కోలాటం ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ, జైఆంధ్రాకాలనీ, చింతల్లోవ లోని జీవీఎంసీ పాఠశాల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, గల్లా చిన్నా ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సంభాషించారు. కార్యక్రమంలో బొండా కృష్ణ, ధర్మ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ సమావేశం ఆనందోత్సాహాల నడుమ సందడిగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యే గణబాబు, మల్కాపురం సీఐ విద్యాసాగర్ భోజనాలు చేశారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ, షిప్‌యార్డ్‌కాలనీ, జీవీ నిలయం, జీవీఎంసీ హైస్కూల్, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ భుజంగరావు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



పచ్చదనంతో శ్రీహరిపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణ

ఆర్పీపేటలో ఆత్మీయ సమావేశం

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలో రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, చైర్మన్ ఉమ నేతృత్వంలో శనివారం 'మెగా పేరెంట్ మీట్' నిర్వహించారు. కార్పొరేటర్ రాజశేఖర్ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చంద్రశేఖర్, జగన్నాథం, సత్యనారాయణ, పరమేశ్వరరావు, వెంటేశ్వరరావు, బాలరాజు, రమణ, దేవుడు, శేషు, ప్రసాద్, నమ్మి శంకర్, జి.నిర్మల, శిరీష, పి.గీత, ఉషారాణి, సావిత్రి, ఉమ సత్యవేణి, ఉషాకిరణ్, జానకి, జయలక్ష్మి, కనకరత్నం, సునీత, రేణుక, స్వాతి, పల్లవి, పేరెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మల్కాపురం ప్రాథమిక పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సుధ



ఇండస్ట్రియల్‌కాలనీలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు పరిధి యల్లపువానిపాలెం, కొత్తపాలెం పాఠశాలల్లో, 91వ వార్డులోని గవర వీధి ప్రాథమికోన్నత పాఠశాలలో, 92వ వార్డు గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, హెచ్‌సీ వెంకటాపురం ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయుల తోపాటు స్థానిక అధికారులు, పోలీసులు పాల్గొన్నారు. విద్యార్థులు పెడదారి పడితే ఏవిధమైన ఇబ్బందులు ఎదుర్కొంటారో వివరించారు. మాదక ద్రవ్యాలు జోలికి పోవద్దని, జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. విద్యార్థులు పాఠశాలకు ఎన్ని గంటలకు వస్తున్నారు.. హాజరు, మార్కులు ఎలా వస్తున్నాయో ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పాఠశాల విడిచి పెట్టిన తర్వాత ఇంటికి వచ్చే సమయాన్ని తల్లిదండ్రులు గమనించాలని కోరారు.



శ్రీహరిపురం జీవీఎంసీ హైస్కూల్‌లో సుందరంగా ముస్తాబు చేసిన తరగతి గది



భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, సీఐ విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



గోపాలపట్నం హైస్కూల్‌లో విద్యార్థికి బహుమతి అందిస్తున్న సీఐ గొలగాని అప్పారావు

సింధియా : జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో గల ప్రైమరీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. పిల్లల భవిష్యత్ తల్లిదండ్రుల చేతిలోనే ఉందన్నారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్‌ను బంగారుమయం చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ గల్లా చిన్నాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు అర్చనలు చేశారు. అలంకరణ అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతినిచ్చారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గణబాబు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ఆలయ ధర్మకర్త ఆర్.మాణిక్యం పర్యవేక్షణలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఆకెళ్ల సూర్యప్రకాష్‌రావు, ఓలేటి చంద్రశేఖర్ శర్మ ధూప దీప నైవేద్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం జరిపించారు. సామూహికంగా దంపతులు పూజల్లో పాల్గొన్నారు. స్వాత్మానందేంద్ర స్వామీజీ, విప్ ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ దంపతులు, నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వామివారిని దర్శించుకున్నారు.

- జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీ, ఏపీఎస్‌ఈబీ కాలనీలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం వైభవం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.



సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుక



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్, డిప్యూటీ మేయర్ జియ్యాని